www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 1 జనవరి 2023

5

వైఎస్ఆర్



సచివాలయాల్లో కమిషనర్ తనిఖీ

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని 35/1, 35/2 డివిజన్ల సచివాలయాలను శనివారం కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ తనిఖీ చేశారు. సచివాలయంలోని అందరూ కార్యదర్శులు యూనిఫామ్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. పింఛన్ల పరిశీలన స్వయంగా కమిషనర్ సిస్టమ్‌లో చేశారు. పెండింగ్ వెరిఫికేషన్స్ పూర్తి చేయాలని వెల్ఫేర్ సెక్రటరీ ఆదేశించారు. ప్రజలకు సేవ చేయడమే మొదటి ప్రాధాన్యతగా ఉండాలని సెక్రటరీలకు సూచనలు ఇచ్చారు. గృహ నిర్మాణాల పురోభివృద్ధి మరింత పెరగాలన్నారు. సచివాలయం పరిధిలో చెత్త పాయింట్స్ లేకుండా తొలగించాలని శానిటేషన్ సెక్రటరీ కి సూచించారు. చివరగా అందరు సెక్రటరీలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి ఇంకా ఉత్సాహంగా పని చేసి ప్రజలకు సేవలు అందించాలని చెప్పారు.

కొత్త ఆశలతో..



- ఉక్కుపరిశ్రమ ఏర్పాటుపైనే ఆశలు
- ఊరిస్తోన్న పరిశ్రమల స్థాపన
- నిర్వాసితుల పరిహారంపై మీనమేషాలు

కొత్త ఏడాది కోటి ఆశలతో స్వాగతం పలుకుతోంది. గడిచిన ఏడాది ఎలా సాగినప్పటికీ 2024 సార్వత్రిక ఎన్నికలు స్వాగతం పలుకుతున్న తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చాల్సిన హామీలపై ప్రజానీకం ఆశలు పెంచుకుంటుంది. 2023 నూతన సంవత్సరం పలువురి లక్ష్యాలకూ ఓ ల్యాండ్‌మార్క్‌గా నిలుస్తున్న విషయం అందరికీ విషయమే. అందరూ ఎవరికి వారు నిర్దేశిత లక్ష్యాలను అధిగమించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వమే ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు నడుంబిగించడం కొసమెరుపైనప్పటికీ ఆచరణపైనే అందరికీ సందేహాలు నెలకొన్న నేపథ్యంలో నూతన సంవత్సరం కొత్త ఆశలు రేపుతోంది. రైతుల ఆకాంక్షలను అధిగమించడానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్త ప్రణాళికలతో ముందుకు వస్తున్నప్పటికీ, ఉసురు తీసుకున్న రైతులకు పరిహారం పెంచినప్పటికీ అందరికీ అందని వైనం నెలకొంటోంది. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు మొదలుకుని సాగునీటి ప్రాజెక్టులకు సస్యశ్యామల సమస్య వేధిస్తూ ఉండడం ఆందోళన కలిగిస్తోంది. ఫలితంగా గండికోట, మైలవరం, పైడిపాలెం, చిత్రావతి ప్రాజెక్టుల్లో పూర్తి స్థాయిలో నీళ్లను నిల్వ చేసినప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఇదిలావుండగా కొత్త ఏడాదిలో సంక్షేమ పథకాలు అమలవుతున్న నేపథ్యంలో జిల్లా వాసుల ఆశలు, ఆకాంక్షలను అంచనాల్ని మించి ఉన్నాయనడంలో సందేహం లేదు. ఏదేమైనా కొత్త ఏడాది కొత్త ఆశల్ని నెరవేరాలని ఆశిద్దాం.

ప్రజాశక్తి-కడప ప్రతినిధి

జిల్లా ప్రగతి రథం నత్తనడక సాగుతోంది. ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టడంతో ప్రగతి పరుగులు తీయడంపై జిల్లా ప్రజానీకం ఆశలు పెంచుకుంది. ఇటీవల జిల్లా పర్యటనలో భాగంగా జనవరి నెలాఖరులో ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన చేయనుండడం మొదలుకుని రిమ్స్‌ సూపర్ స్పెషాలిటీ సదుపాయంతోపాటు క్యాన్సర్, ఎల్‌వి ప్రసాద్ ఐ యూనిట్, మెంటల్ ఇన్స్టిట్యూట్‌తోపాటు రాజోలి, జొలదరాశి, కుందూ లిఫ్ట్, జిఎన్‌ఎస్‌ఎస్‌-2 నుంచి రాయచోటికి లిఫ్ట్ మొదలగు పనులకు సుమారు రూ.12 వేల కోట్ల మేరకు శంకుస్థాపనలు చేసిన విషయం తెలిసిందే. అభివృద్ధి పనులను ఆచరణలో పెట్టి పరుగులు తీయించి, ఆచరణకు నోచుకునేలా చర్యలు తీసుకుంటేనే సార్థకత నెరవేరనుంది. వీటితోపాటు రాష్ట్ర ప్రభుత్వం యోగి వేమన యూనివర్శిటీకి నిధుల కొరత, కొత్త కోర్సులు ఏర్పాటు, ఫ్యాకల్టీ నియామకాలు, నందలూరులో ఉద్యానవన యూనివర్శిటీ ఏర్పాటు, జిఎన్‌ఎస్‌ఎస్‌ ఫేజ్‌-2 పనులు, ఒంటిమిట్ట కోదండరామాలయ మాస్టర్ ప్లాన్, ఐటీపార్క్ మొదలగు అభివృద్ధి పనులు చేయాల్సి ఉంది. కేంద్రం వెనుకబడిన నిధుల విడుదల పునరుద్ధరణ మొదలుకుని కొప్పర్తికి పర్యావరణ అనుమతి వరకు పెండింగ్‌లో పెట్టిన సంగతి తెలిసిందే. 2014 రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న విధంగా కేంద్ర ప్రభుత్వం సెయిల్ ఆధ్వర్యంలో ఐరన్‌ఓర్ బెడ్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాల్సి ఉంది. కేంద్రం మొండిచేయి చూపించడంతో రాష్ట్ర ప్రభుత్వమే చొరవ తీసుకుని శంకుస్థాపన చేసింది. మూడేళ్లలో రూ.15 వేల కోట్ల వ్యయంతో నిర్మించనున్నట్లు పేర్కొనడం, జనవరి నెలాఖరులో శంకుస్థాపన చేయనుండడం ముదావహం. కొప్పర్తి పారిశ్రామిక వాడకు పర్యావరణ అనుమతి లేకపోవడంతో జిల్లా పారిశ్రామిక ప్రగతి వెనుకబడిపోతోంది. పలితంగా వేలాది మంది నిరుద్యోగ యువత పొట్ట చేతబట్టుకుని గల్ఫ్ ఇతర పశ్చిమ దేశాలకు వలసవెళ్తోంది. దేశీయంగా నిరుద్యోగం పెరిగిపోతోంది. వీటికితోడు వ్యవసాయ రంగాభివృద్ధిలో కీలకమైన గండికోట, తెలుగుగంగ కాల్వల వెడల్పు పనులు, అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణ పనులు, జిఎన్‌ఎస్‌ఎస్‌-2 పనులు మొదలుకుని, ఉమ్మడిజిల్లాలోని 15 రిజర్వాయర్ల పరిధిలో ఏ ఒక్క ప్రాజెక్టు చివరి ఆయకట్టు వరకు నీరందించే పరిస్థితి కనిపించడం లేదు. ఫలితంగా రిజర్వాయర్లలో నీళ్లు నిలిపినప్పటికీ సద్వినియోగం చేసుకునే అవకాశం లేకుండా పోతోంది. ఈ ఏడాది శ్రీశైలం రిజర్వాయర్ ఎనిమిది సార్లు నిండిన నేపథ్యంలో గండికోట, మైలవరం, పైడిపాలెం, చిత్రావతి, బ్రహ్మంసాగర్, ఎస్‌ఆర్‌-1, ఎస్‌ఆర్‌-2 వంటి ప్రాజెక్టుల్లో పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేసిన సంగతి తెలిసిందే. ఇదే సమయంలో అన్నమయ్య, పింఛా, ఎగువ సగిలేరు వంటి ప్రాజెక్టుల మరమ్మతులు ఎప్పటికి సాకారమవుతాయో తెలియని పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. ఇదిలావుండగా గండికోట, సోమశిల, పైడిపాలెం, చిత్రావతి, సోమశిల ప్రాజెక్టుల పరిధిలోని నిర్వాసితు లకు పరిహారం అందించాల్సిన అవసరం ఉంది. వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికల నాటికైనా నిర్వాసితులు, పర్యావరణ అనుమతులు వంటి ప్రధాన సమస్యలు పరి ష్కారమై ప్రగతి రథం పరుగులు తీయాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

విధానాలు మార్చుకోకపోతే దేశానికి ప్రమాదం

- సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి -కడప అర్బన్

ప్రత్యేక హోదాను అపహాస్యం చేస్తున్న బిజెపి పట్ల వైసిపి, టిడిపి, జనసేన ఎందుకు మౌనం పాటిస్తున్నాయని ప్రజలకు సమాధానం చెప్పాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సమతుల్య సమాజాన్ని సాధించేందుకు రాజ్యాంగం పెట్టిన రిజర్వేషన్లను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ఎపికి ఎనిమిదిన్నరేళ్లుగా లేని రాజధాని సమస్యను తెచ్చి పెట్టారని వాపోయారు. కార్పొరేట్లకు 11 లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇవ్వడం వల్లనే దేశంలోని సామాన్యులపై అధిక పన్నులు వేస్తున్నారన్నారు. దేశంలో ఎన్నికల కమిషన్ పట్టించుకోక పోవడం వల్లనే డబ్బు, మద్యం ఎన్నికల్లో ఏరులై పారుతున్నాయని చెప్పారు. బిజెపి, వైసిపి విధానాలు మార్చుకోకపోతే దేశానికి ప్రమాదకరమని హెచ్చరించారు. రాష్ట్రంలో ప్రతినెల ఒకటవ తేదీ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని, సామాన్య ప్రజలపై అధిక భారాలు వేస్తున్న, రాష్ట్రంలో అమలు చేస్తున్న నవరత్నాలు ఒక్కొక్కటి రాలిపోతున్న పరిస్థితులపై వైసిపి ప్రభుత్వం మౌనం వీడి ప్రజలకు జవాబు చెప్పాల్సిన అవసరముందని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం మౌనం వీడి రాష్ట్ర ప్రజలకు జవాబు చెప్పాల్సిన అవసరం ఉందని నిలదీశారు. ప్రజా వ్యతిరేక విధానాలు మార్చుకోవాల్సిన అవసరం ఉందని హితవు పలికారు. సమావేశంలో సిపిఎం కడప నగర కార్యదర్శి ఎ.రామ్మోహన్, కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, ఓబులేసు పాల్గొన్నారు. **పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం..** ప్రజలు పోరాటాల ద్వారానే వారి సమస్యలను పరిష్కరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల కోసం ఎదురు చూస్తున్న ప్రజలకు ప్రభుత్వం నుంచి నిరాశే ఎదురవుతోందని చెప్పారు. సంక్షేమ పథకాల్లో కోతల వల్ల ప్రజలకు పూర్తి ప్రయోజనాలు అందడం లేదని పేర్కొన్నారు. వయోవృద్ధులు, వితంతువులకు ఆదరువుగా ఉన్న పెన్షన్లలో కూడా కోతలు పెడుతున్నారని తెలిపారు 300 యూనిట్ల విద్యుత్ వాడకం ఉంటే పెన్షన్ ఇవ్వబోమని చెప్పడం దుర్మార్గమన్నారు. అమ్మఒడి లబ్ధిదారులకు కూడా షరతులు పెట్టి 3.5 లక్షల మందికి కోత విధించారని తెలిపారు. ట్యాబ్‌ల పంపిణీ పేరుతో మరో 5 లక్షల మందిని తగ్గిస్తున్నారని చెప్పారు. రేషన్ డిపోలలో సంక్రాంతి సందర్భంగా బియ్యంతోపాటు పండుగ సరుకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కరోనా సమయం నుంచి కేంద్రం ఇచ్చే ఉచిత బియ్యంలో కూడా మోడీ ప్రభుత్వం కోతలు పెట్టడం దారుణమన్నారు. సమస్యలపై సిపియం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా జనవరి 2వ వారంలో సచివాలయాల వద్ద రాయబారాలు, ధర్నాలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రభుత్వ దృష్టికి సమస్యల తీవ్రతను తీసుకెళ్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

సంక్షేమ పథకాలతోనే అభివృద్ధి

ప్రజాశక్తి-కలసపాడు

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు అనే సంక్షేమ పథకాలతోనే అభివృద్ధి సాధ్యమని ఎంఎల్‌సి డి.సి. గోవిందరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని చిత్త రాజమనోహర్‌రెడ్డి కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన క్షేత్రస్థాయి, సచివాలయ పరిధిలోని, పంచాయతీ బూతు కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధా మాట్లాడుతూ వాలంటీర్లు, సచివాలయ భూత్ కన్వీనర్లు కీలకమైన పాత్ర పోషించాలన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి నిత్యం వారదులుగా ఉంటూ సంక్షేమ పథకాలు తీసుకెళ్లాలని చెప్పారు. పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి సలహా దారులు పి .నాగార్జున రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధి పథకంలో భాగంగా రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ జగనన్న పక్కా గృహాలను ఏర్పాటు చేశారని, ప్రతి ఒక్కరు వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కె. రమణారెడ్డి, మండల కన్వీనర్, సుదర్శన్, మాజీ ఎంపీపీ రాజుపాలెం సర్పంచ్ సుధా రామకృష్ణారెడ్డి, ఎంపీపీ బోధన పోయిన నారాయణ, జడ్‌పిటిసి అంకన గురివిరెడ్డి, వైస్ ఎంపిపి ఎ. భాస్కర్‌రెడ్డి, వావిళ్ళ మల్లిక, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల వైసిపి అబ్జర్వర్ ఎం.జగన్ మోహన్ రెడ్డి, సహకార సొసైటీ బ్యాంకు చైర్మన్ పి.పురుషోత్తంరెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ జె.సింగరయ్య సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

తేక్వాండో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

తేక్వాండో జాతీయ స్థాయి పోటీలకు ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. అండర్ -19 విభాగంలో డిసెంబర్ 26న రైల్వే కోడూరు లో జరిగిన పోటీల్లో సంగా భవ్య, సాయి ప్రీతి , 27న ఆర్లగడ్డ లో జరిగిన అండర్ 17 విభాగంలో పుల్లూరు కాసిం ప్రతిభ చూపించి జాతీయస్థాయికి ఎంపికైనట్లు కోచ్ సుభాష్ తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి అభినందించారు. జాతీయస్థాయిలో చక్కటి ప్రతిభ చూపి రాష్ట్రానికి మంచి పేరు తేవాలని పేర్కొన్నారు. అండర్-19 విభాగంలో సంధ్యారాణి కాంస్య పతకం, సోహెల్ కాంస్య పతకం సాధించారు. అండర్ -17 విభాగంలో అబూకర్, ఆఫ్రిన్, జుబేదా కాంస్య పతకాలు సాధించినట్లు మాస్టర్ నాయబ్ రసూల్ తెలియజేశారు.

నకిలీ సర్టిఫికెట్లతో పింఛన్ల నమోదు

ప్రజాశక్తి-పోరుమామిళ్లటౌన్

మండలంలో నకిలీ సర్టిఫికెట్లతో దాదాపు 400 నుండి 500 వరకు పింఛన్లు నమోదు చేశారని మానవ హక్కుల పరిరక్షణ ప్రధాన కార్యదర్శి ముత్యాల ప్రసాదరావు ఆరోపించారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో వికలాంగులు, అంధ, వినికిడికి సంబంధించి నకిలీ సర్టిఫికెట్లతో కొందరు పింఛన్లు నమోదు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. సర్టిఫికెట్ల కోసం రిమ్స్ వైద్యాధికారులు రూ.20 వేల నుంచి రూ. o30 వేల వరకు తీసుకుని సర్టిఫికెట్లు ఇస్తున్నారని వాపోయారు. కొన్ని పంచాయతీలలో ఒకే ఇంట్లో ఉన్న భార్యాభర్తల కూడా నకిలీ సర్టిఫికెట్ల ద్వారా పింఛన్లు నమోదు చేశారని వాపోయారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో విచారించి బాధ్యులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

మహిళా సాధికారత అవసరం

ప్రజాశక్తి - కడప అర్బన్

మహిళా సాధికారత ఎంతో అవసరమని ప్రముఖ వ్యాపారవేత్త, శ్రీ విజయ దుర్గాదేవి ఆలయ కార్య నిర్వాహక కార్యదర్శి దురా ప్రసాద్ పెడుతున్నారు. శనివారం దుర్గాదేవి ఆలయం ఎదురుగా అశ్విని, ప్రసన్న ఏర్పాటు చేసిన 'ది ప్రివిజన్ ఎ జైల్ థీమ్' రెస్టారెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇద్దరు మహిళలు కలసి రెస్టారెంట్ ఏర్పాటు చేయడం అభినం దనీయం అన్నారు. రుచి, శుచి, శుభ్రతకు ప్రాధాన్యత ఇస్తే రెస్టారెంట్ దిగ్విజ యంగా సాగుతుందని పేర్కొన్నారు. వెజ్, నాన్ వెజ్ అందుబాటులో ఉండడం వల్ల భోజన క్రియలు అధికంగా వచ్చే అవకాశం ఉందని తెలిపారు. వినూత్న రీతిలో జైలు వాతావరణం ఎలా ఉంటుంది అనే విధానంలో రెస్టారెంట్ ఏర్పాటు చేయడం వినూత్న ఆలోచనకు నాందిగా చెప్పారు. రెస్టారెంట్ నిర్వాహకులు అశ్విని, ప్రకాష్, ప్రసన్న, పవన్ మాట్లాడుతూ రెస్టారెంట్లు భోజన సౌకర్యంతో పాటు, పుట్టినరోజు వేడుకలు, ఫ్యామిలీ ఫంక్షన్లు, నూతన సంవత్సర ఈవెంట్స్ జరుపుకునేందుకు సౌకర్యం ఉందని పేర్కొన్నారు. ప్రజలు తమ రెస్టారెంట్ ను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో రంజిత్ కుమార్, రామకృష్ణ, సుమన్, తేజ, దినేష్, హేమంత్, వంశీ, భరత్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న దుర్గాప్రసాద్

కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- బిసి సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు

ప్రజాశక్తి - కడప అర్బన్

నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో గాయత్రి మహిళా స్వయం సహాయక సేవ సంఘం నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణను మహిళలు సద్వినియోగం చేసికోవాలని బిసి సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు పిలుపునిచ్చారు. శనివారం డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగం నగరంలోని అక్కయ్యపల్లిలో ఉచిత టైలరింగ్ శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాడానికి ఇలాంటి శిక్షణ ఎంతోగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. 45 రోజుల పాటు శిక్షణ ఉంటుందని నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి కె.మణికంఠ అన్నారు. ప్రతి మహిళా ఖాళీ సమయాలలో శిక్షణను నేర్చుకుని స్వయం అభివృద్ధి సాధించవచ్చన్నారు. కార్యమంలో రాష్ట్ర బిసి నాయకులు వెంకట సుబ్బమ్మ, మూలే సరస్వతి, లింగమూర్తి, కార్పొరేటర్ జిలాని బాషా, నారాయణమ్మ పాల్గొన్నారు.

సిఐటియు నూతన జిల్లా కమిటీ ఎన్నిక

-అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శ్రీనివాసులురెడ్డి, మనోహర్

ప్రజాశక్తి - కడప అర్బన్



సి ఐ టి య ు జిల్లా 9వ మహాసభలు రెండు రోజులపాటు నగరంలో ఘనంగా నిర్వహించామని, చివరి రోజు నూతన కడప జిల్లా కమిటీ 50 మంది, ఆఫీస్ బేరర్స్ 11 మందితో ఎన్నుకున్నట్లు సిఐటియు నూతన జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు రెడ్డి, మనోహర్ తెలిపారు. శనివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో కార్మిక వర్గ సమస్యలు చాలా తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. జిల్లాలో కార్మికులకు కనీస వేతనాలు, హక్కులు, ఉద్యోగ, పని భద్రత, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై సమరశీల పోరాటాలకు శ్రీకారం చుడుతామని చెప్పారు. పారిశ్రామిక వాడల్లో ఇతర రాష్ట్రాల కార్మికులతో పనిచేయించుకుంటున్నారని, కనీస వేతనాలు లేవని పేర్కొన్నారు. ఈఎస్ఐ, బీమా, పిఎఫ్ ఏమాత్రం లేవని తెలిపారు. కార్మిక చట్టాలు పారిశ్రామిక వాడ ప్రాంతాల్లో ఎక్కడ అమలు కావడం లేదని చెప్పారు. సమస్యలపై రానున్న కాలంలో పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలో ఆశా, అంగన్వాడీ వర్కర్లు, మధ్యాహ్న భోజనం కార్మికులపై రాజకీయ వేధింపులు మానుకోవాలని పేర్కొన్నారు. మహాసభ స్ఫూర్తితో రానున్న కాలంలో కార్మిక వర్గ సమస్యలపై సమరశీల పోరాటాలకు శ్రీకారం చుడతామని చెప్పారు. విలేకరుల సమావేశంలో సిఐటియు జిల్లా కోశాధికారి బి.లక్ష్మీదేవి, కార్యదర్శి కె. సత్యనారాయణచారి పాల్గొన్నారు.

డిజిటల్ లైబ్రరీ ప్రారంభం

ప్రజాశక్తి-చెన్నూరు

మండలంలోని బలిసింగయ్య పంచాయతీ కనపర్తిలో రూ. 16 లక్షలతో నిర్మించిన డిజిటల్ లైబ్రరీని శనివారం కమలాపురం ఎంఎల్‌ఎ పి. రవీంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి అనేక పథకాలు ప్రవేశపెట్టారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ ప్రతి పేద విద్యార్థికి కార్పొరేట్ విద్యను అందించేందుకు నాడు నేడు ద్వారా అభివృద్ధి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటసుబ్బయ్య, మండల కన్వీనర్ జి.ఎన్. భాస్కర్ రెడ్డి, ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్, పల్లెకృష్ణారెడ్డి, రఘురాం రెడ్డి, మండల ఉపాధ్యక్షులు ఆర్‌ఎస్‌ఆర్, పార్టీ నాయకులు ముదిరెడ్డి సుబ్బారెడ్డి, దిలీప్ కుమార్ రెడ్డి, సర్పంచులు వెంకట సుబ్బయ్య, ఎస్‌వి నారాయణరెడ్డి, తహశీల్దార్ పటాన్ అలీ ఖాన్, ఎంపిడిఒ సురేష్‌బాబు, ఎఇలు మూర్తి మురళి, రామలింగారెడ్డి, వినోద్ కుమార్ రెడ్డి, మిల్లింగ్, పీఎం గంగాధర్, ఎపిఒ సుధారాణి పాల్గొన్నారు.

నిరాశే

ప్రజాదృష్టి

జిల్లాలోని పలువురు పెన్షనర్లకు నోటీసులివ్వడం ఆందోళనను కలిగిస్తోంది. వృద్ధాప్యంలోని పండుటాకులు, ఏఆధారమూ లేని అభాగ్యులకు ఇచ్చే పింఛను తొలగించనుండడం పట్ల సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. సిక్స్‌స్టెప్ వ్యాలిడేషన్ పేరుతో విద్యుత్ యూనిట్లలో పెరుగుదల మొదలుకుని 120 సిసి మోటార్‌బైక్, 10 ఎకరాలపైన మెట్ట, లేకఐదు ఎకరాల మాగాణి, నాలుగు టైర్ల వాహనం, ఆదాయ పన్ను, 1000 చదరపు అడుగుల విస్తర్ణంలో ఇళ్లు కలిగి ఉండడం వంటి నిబంధనల పేరుతో తొలగిస్తున్నామని నోటీసులు జారీ చేయడం విస్మయాన్ని కలిగిస్తోంది. సంక్షేమ పథకాల లబ్ధిదారులకు కాలం తీరిన గైడ్‌లైన్స్ ఆసరాతో భిక్షకులు మాదిరి చిన్నచూపుతో చూడడం క్షంతవ్యం కాదు. మారిన కాలానికి అనుగుణంగా జీవన ప్రమాణాలను పెంచడంతోపాటు గైడ్‌లైన్స్‌ను అప్‌డేట్ చేయకుండా కత్తిరింపుల పర్వానికి దిగడంలోని హేతువు ప్రశ్నార్థకంగా మారింది. విభజిత వైఎస్ఆర్ కడప జిల్లాలోని 2.51,277 లక్షల మంది సంక్షేమ పెన్షన్‌దారుల్లో 12,600 మంది పెన్షన్ తొలగింపును రుజువు చేసుకోవాలనే పేరుతో నోటీసులు జారీ చేయడం విస్మయాన్ని కలిగిస్తోంది. ప్రతి ఆర్నెళ్లకోసారి పింఛన్‌దారుల ఆడిటింగ్ చేయాల్సిందే. కానీ మారుతున్న కాలానికి అనుగుణంగా సిక్స్‌స్టెప్ వ్యాలిడేషన్ గైడ్‌లైన్స్ అప్‌గ్రేడ్ చేయాల్సిన అవసరం ఉరుముతోంది. మారిన జీవన ప్రమాణాల నేపథ్యంలో ఇటువంటి గైడ్‌లైన్స్ ఆధారంగా నిర్ధారించడంలో ని ఔచిత్యమేమిటో వెల్లడించాల్సి ఉంది. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్ వినియోగం విషయంలో గైడ్‌లెన్స్‌ను మార్చాల్సిందే. ఎందుకంటే మారిన వాతావరణ పరిస్థితుల్లో విద్యుత్ లేకపోతే ఊపిరి ఆడని పరిస్థితి కనిపిస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో ఫ్యాన్, కూలర్ వినియోగం తప్పనిసరిగా మారింది. జీవిత అవసరాల్లో కీలక భూమిక పోషిస్తున్న విద్యుత్ వినియోగాన్ని 300 యూని ట్లుగా నిర్ధారించడం హాస్యాస్పదంగా మారింది. ఇదేతరహాలో ఆధా ర్ నెంబర్‌కు ఎవరి భూములో, నాలుగు టైర్ల వాహనాలు లింక్ కావ డం అనేక ఘటనలు చూస్తూనే ఉన్నాం. ఇటువంటి తప్పిదాల వల్లే రుజువులు చేసుకోవడం పేరుతో పండుటాకులకు పింఛన్ నిలిపి వేస్తామనడం అభాగ్యుల జీవితాలు ప్రశ్నార్థకంగా మారుతుండడం ఆందోళన కలిగిస్తోంది. జీవిత చరమాంకంలోని పండుటాకులు దా రులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి రుజువు చేసుకోవడం ఆచరణలో ఎంతవరకు సాధ్యమో పాలకులు ఆలోచనలు చేయాలి. జిల్లా వ్యాప్తంగా 12,600 పాత పింఛన్లను తొలగించడంలోని హేతుబద్ధతను మరోసారి ఆలోచన చేయాల్సి ఉంది. కొత్తగా మరో 8000 పింఛన్లు ఇవ్వడం సంగతి అలా ఉంచితే కత్తిరిం పుల సంగతే చరమాంకంలోని వృద్ధులను ఆందోళన కలిగిస్తోంది. అవ్వాతాతల పింఛన్‌ను దశల వారీగా పెంచుతూ పోతామనే హామీ బాగానే ఉంది, కానీ పెంచిన వనరులను పాతవాటి తొలగింపుల ద్వారా పూడ్చుకుంటున్నారనే విమర్శను ఎదుర్కోవాల్సి వస్తోంది. నిజమైన అనర్హులు ఉన్నారనే ప్రభుత్వ వాదనలో హేతుబద్ధత ఉన్నప్పటికీ అటువంటి వారి శాతాన్ని అతి తక్కువగా ఉన్నదనే సంగతిని మరువరాదని గ్రహించాలి.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి



బుద్ధ వెంగల్‌రెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జడ్‌పి చైర్మన్ అమర్‌నాథరెడ్డి

స్ఫూర్తి ప్రదాతల కీర్తిని శాశ్వతం చేద్దాం

ప్రజాశక్తి-కడప అర్బన్

స్ఫూర్తి ప్రదాతల కీర్తిని శాశ్వత చేద్దామని, సమాజంలో అన్ని వర్గాలు ఆనందంగా ఉండాలని, సాటి మనిషిని కష్టకాలంలో ఆదుకోవడం కనీస ధర్మమని, దాంతో విలువలు పెరుగుతాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం బ్రౌన్ గ్రంథాలయంలో రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దనరాజు, బాసట స్వచ్ఛంద సేవా సంస్థ మహాదాత బుడ్డా వెంగళరెడ్డి 122వ వర్థంతి సభను నిర్వహించారు. బుడ్డా వెంగళరెడ్డి చిత్రపటానికి పూలమాల అలంకరించిన అతిథులు ఘనంగా నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ దానధర్మాలు చేయడమంటే ఇష్టమని, బుడ్డా వెంగళరెడ్డి గురించి తెలిశాక ఆసక్తి మరింత పెరిగిందన్నారు. అలాంటి మహానుభావుల గురించి ఏదైనా మంచి పని తలపెడితే తాను తప్పక సహకరిస్తానన్నారు. ఎమ్మెల్సీ సి. రామచంద్రయ్య మాట్లాడుతూ సీమలోని బుడ్డా వెంగళరెడ్డి లాంటి దాతల గురించి నేటి తరానికి తెలిపి వారి స్ఫూర్తి నింపేందుకు కృషి చేస్తున్న వ్యక్తులు, సంస్థలను అభినందించారు. వెంగళరెడ్డి చరిత్రను పాఠాలుగా పెట్టాలని సూచించారు. సభాధ్యక్షులు, మున్సిపల్ మాజీ చైర్మన్ హరీంద్రనాథ్ మాట్లాడుతూ బుడ్డా వెంగళరెడ్డి గురించి భావితరాలకు తెలుపాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ముఖ్య బాధ్యులు బైరెడ్డి రామకృష్ణారెడ్డి, రాటాల గోపి మాట్లాడుతూ కడప నగరంలో బుడ్డా వెంగళరెడ్డి విగ్రహ స్థాపన జరిగితే నాల్గవ వంతు ఆర్థికసాయం చేస్తామన్నారు. రెడ్డి సేవా సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి మాట్లాడుతూ తాను సైతం విగ్రహం ఏర్పాటుకు సహకరిస్తామన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మానస చిన్నపరెడ్డి మాట్లాడుతూ బుడ్డా వెంగళరెడ్డి కీర్తిని శాశ్వత పరిచేందుకు తన సహకారం ఉంటుందన్నారు. స్థానిక ప్రముఖులు దేసు వెంకటరెడ్డి కూడా మాట్లాడారు. బాసట సంస్థ అధ్యక్షులు మేరువ బాలాజీరావు పర్యవేక్షణలో పాత్రికేయుడు ఫణి రూపొందించిన 'మహాదాత బుడ్డా వెంగళరెడ్డి' పుస్తకాన్ని అతిథులు ఈ సందర్భంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.నారాయణ, ఉపాధ్యాయ, ఉద్యోగ, విద్యార్థి, దళిత, మేధావి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


వేమన జయంతి శుభసూచికం

కడప అర్బన్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వేమన జయంతిని జనవరి 19న రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా జరపాలని నిర్ణయించడం శుభసూచికమని ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు ఆచార్య ఎన్. ఈశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గొప్ప మానవతావాది, సామాజికవేత్త, సంస్కరణకారుడు, విప్లవ కవి అయిన వేమన జయంతిని ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా జరప తలపెట్టడం ఆహ్వానించదగ్గ పరిణామమని పేర్కొన్నారు.

కెఎస్ఆర్ఎంలో నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి- కడప అర్బన్

నగర శివారులోని కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో స్టూడెంట్స్ క్లబ్, కల్చరల్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం కళాశాల ఆడిటోరియంలో ఉత్సాహంగా నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కోశాధికారి కందుల రాజేశ్వరమ్మ మాట్లాడుతూ న్యూ ఇయర్ ముఖ్య ఉద్దేశం, మనకు కొత్త సంవత్సరం చీకటి రోజులను అధిగమించి ఆత్మస్థైర్యం, ఆనందం, శక్తితో నిండిన సంవత్సరం కావాలని ఆకాంక్షించారు. విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం 2022 వ సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఎస్.ఎస్ మూర్తి, విభాగాల అధిపతులు, డీన్‌లు కళాశాల కల్చర్ కో-ఆర్డినేటర్ వీర శంకర్, స్టూడెంట్ క్లబ్ కో- ఆర్డినేటర్ లీన రాస్తాపూర్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



నూతన సంవత్సర వేడుకల్లో విద్యార్థులు

రిమ్స్‌లో కోవిడ్ వార్డులు ఏర్పాటు

- పరిశీలించిన ఆర్ఎంఒ డాక్టర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-కడప సిటీ

కడప నగర శివారులోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (రిమ్స్)లో కొత్త వేరియంట్ బిఎఫ్-7 నివారణ కోసం అన్ని వసతులతో కూడిన కోవిడ్ వార్డులు ఏర్పాటు చేశామని సిఎస్ ఆర్ఎంఒ డాక్టర్ శ్రీని వాసులు పేర్కొన్నారు. శనివారం ఆయన వార్డుల్లోని వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోవిడ్ వార్డులో 41 పడకలు, శారీ వార్డులో 40 పడకలు ఉన్నాయన్నారు. ఐసియూ పడకలు 10 ఏర్పాటు చేశామని చెప్పారు. 18 మంది డాక్టర్లు, 18 మంది స్టాఫ్ నర్సులు, 18 మంది ఎఫ్ఎన్ఒలు, 18 మంది ఎంఎన్ఒలను కోవిడ్ విధుల్లో ఉంటారన్నారు. 61 వెంటిలేటర్స్ పడకలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. జగనన్న ప్రాణ వాయువు సంబంధించిన 5 పడకలు, ప్రధానమంత్రి కేర్ వార్డు ఒకటి అందుబాటులో ఉంచామని చెప్పారు. లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్స్ 2, ఆక్సిజన్ సప్లయ్ మానిటరింగ్ అధికారిగా అనస్తీషియా విభాగాధిపతి డాక్టర్ సునీల్, చీఫ్ నోడల్ ఆఫీసర్‌గా మెడికల్ డిపార్ట్మెంట్ విభాగాధిపతి లక్ష్మీబాయ్ వ్యవహరిస్తారని చెప్పారు. ప్రస్తుతం ఆసుపత్రిలో కరోనా కేసులేమి లేవన్నారు. జనసమూహం ఎక్కువగా ఉన్న ప్రదేశాలు, రద్దీ ప్రాంతాల్లో ప్రజలు మాస్క్ తప్పనిసరిగా ధరించి అప్రమ త్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఆయన వెంట డిప్యూటీ ఆర్ఒఎ డాక్టర్ రాజేశ్వరి, గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్ శ్రీకాంత, హెల్త్ సూపర్ వైజర్ డి.రమణయ్య ఉన్నారు.



వార్డును పరిశీలిస్తున్న ఆర్ఎంఒ డాక్టర్ శ్రీనివాసులు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కడప అర్బన్ : నగరంలోని మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కమిషనర్ కృషి చేయాలని సిఐటియు నగర అధ్యక్షుడు చంద్రారెడ్డి, మాజీ కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని చెమ్మునియాపేట, అక్కాయపల్లె ప్రాంతాల్లో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో క్లాప్ డ్రైవర్లకు పెండింగ్లో ఉన్న మూడు నెలల జీతాలు తక్షణమే చెల్లించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు విధుల్లో ఉన్నప్పటికీ నాలుగు సార్లు ఫొటోలు పంపాలని అధికారులు చెప్పటం సమంజసం కాదన్నారు. దీని కారణంగా కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. జనవరి 2, 3, 4 తేదీల్లో సిఐటియు రాష్ట్ర మహాసభలు భీమవరంలో జరుగుతున్నాయని, మహాసభల్లో మున్సిపల్ కార్మికుల సమస్యలపై కూడా చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారని పేర్కొన్నారు. రానున్న కాలంలో కార్మికులందరూ ఐక్యంగా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు కంచుపాటి తిరుపాల్, శ్రీరామ్, కొండమ్మ, మురళి, కార్మికులు పాల్గొన్నారు.

సైనికుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

కడప అర్బన్ : డిఆర్ఒ గంగాధర్ గౌడ్ శనివారం తన ఛాంబర్లో మాజీ సైనికుల సంఘం ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సైనికులు సమాజంలో గుర్తింపు, సామాజిక సేవలలో పాల్గొనడం ఆనందించ తగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి. లక్ష్మీనారాయణ, కార్యదర్శి బీ.వీ. గోపాల్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ ఎస్. గఫూర్, బి. శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

పశుసంవర్ధక శాఖ జెడిగా శారదమ్మ

కడప అర్బన్ : పశుసంవర్ధక శాఖ జిల్లా సంయుక్త సంచాలకులుగా డాక్టర్ సి. శారదమ్మ బాధ్యతలు స్వీకరించారు. శనివారం నంద్యాల రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ నాన్ గ్రాడ్యుయేట్ వెటరినెరియన్స్ ఫెడరేషన్ తరపున శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శారదమ్మ మాట్లాడుతూ వైఎస్ఆర్ జిల్లాలో పనిచేస్తున్నటువంటి సభ్యులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగులకు ఎలాంటి సమస్య వచ్చినా తాను ముందుండి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్.చాంద్ బాషా, జిల్లా చైర్మన్ ఆనంద్ బాబు, జిల్లా కార్యదర్శి సి.సదాశివయ్య, బాబు నాయక్, వెంకటసుబ్బయ్య, మనీ, విద్యాసాగర్, రమణయ్య, గోపాల కృష్ణ, షాహిదాబేగం, జయపాల్, అంజలి పాల్గొన్నారు.



జెడి శారదమ్మను సన్మానిస్తున్న సిబ్బంది

ప్రజల వద్దకే పరిపాలన : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మైదుకూరు


మాట్లాడుతున్న ఎస్.రఘురామిరెడ్డి

వైసిపి ప్రభుత్వంలో ప్రజల వద్దకే పరిపాలన అని ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి తెలిపారు. స్థానిక వనిపెంట రోడ్డులోని డిసియల్ ఫంక్షన్ హాల్‌లో శనివారం సచివాలయ వాలంటీర్లకు, కన్వీనర్లకు పింఛన్ పెంపు, సంక్షేమ పథకాల అమలుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడతూ ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన అనడానికి సిఎం జగన్ ఏర్పాటు చేసిన వాలంటరీ,సచివాలయ వ్యవస్థలే నిదర్శనమన్నారు. వాలంటీర్లు సిఎం జగన్ వారియర్స్ అని పేర్కొన్నారు. మేనిఫెస్టోలో చెప్పిన, చెప్పని హామీలను సైతం నెరవేర్చిన ఘనత సిఎం జగన్‌దేనని ఆయన కొనియాడారు. ఇచ్చిన మాట ప్రకారం జనవరి నుండి లబ్ధిదారులకు రూ.2,750 పింఛన్ సీఎం జగన్ అందిస్తున్నారన్నారు. ప్రతి సచివాలయానికి ముగ్గురు కన్వీనర్లను నియమించామన్నారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలంటే వాలంటీర్ల సహాయసహకారాలు ఉండాలన్నారు. కార్యక్రమంలో మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచునూరు చంద్ర. మైదుకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ అన్నపురెడ్డి శ్రీమన్నారాయణరెడ్డి, ఎంపిడిఒ కుళాయమ్మ, మూలె సుధాకర్‌రెడ్డి, షరీఫ్, మూల భరత్‌రెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కేక్‌లు పంపిణీ

ప్రజాశక్తి - జమ్మలమడుగు

జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఉన్న దాదాపు 100 చర్చిలకు కేక్‌లను పంపిణీ చేస్తున్నట్లు ఎపి ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మార్బుల్ శ్రీను తెలిపారు. పట్టణంలోని చర్చిలకు శనివారం కేక్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో క్రైస్తవులకు నూతన సంవత్సరం పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఎమ్మెల్యే దాదాపు రెండు లక్షలు తన సొంత డబ్బుతో కేక్‌ల పంపిణీ చేపట్టారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సత్యబాబు, రాజు, చంద్రమోహన్ పాల్గొన్నారు.


కేక్‌లను పంపిణీ చేస్తున్న డైరెక్టర్ మార్బుల్ శ్రీను

జగన్ మాటలన్నీ అబద్దాలే..!

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నర్సీపట్నం బహిరంగ సభలో చెప్పిన మాటలన్నీ అబద్దాలేనని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చెప్పిందే చేస్తా.. చేసిందే చెప్తానని, అందులో ఎన్నికల మేనిఫెస్టోలోని 98.40 శాతం హామీలను నేరవేర్చినట్లు సిఎం చెప్పడం హాస్యాస్పదమన్నారు. జగన్, అబద్దాలు కవల పిల్లలని విమర్శించారు. మేనిఫెస్టోలో పేర్కొన రైతులకు సంబంధించిన మొదటి అంశాన్నే నెరవేర్చలేదని మండిపడ్డారు. పంట వేసే సమయానికి మే నెలలో రూ.12,500 ఇవ్వడంతోపాటు వడ్డీలేని పంట రుణాలు ఇస్తామని చెప్పారన్నారు. అలాగే గిట్టబాటు ధరకు గార్యంటీ ఇవ్వడంతోపాటు ప్రతి నియోజకవర్గంలో శీతల గిడ్డంగులు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. సహకార డైరీకి పాలు పోసే ప్రతి పాడి రైతుకు లీటర్ కు రూ.4 బోనస్ ఇస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నట్లు తెలిపారు. రైతులకు సంబంధించిన రూ.12500లో రూ.5000లు కోత పెట్టి మిగిలిన దానిని మూడు దఫాలుగా ఇస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం అనారోగ్యశ్రీగా తయారైనట్లు తెలిపారు. మహిళలకు ఇచ్చిన మద్యపాన నిషేధ హామీ నేరవేరకపోగా మద్యపాన నిషా పథకంగా తయారైందని తెలి పా రు. మాట తప్పడం, మడమ తిప్పడం అనేది జగన్ దినచర్య అన్నారు. వైసిపి ప్రభుత్వం1.60 శాతం హామీలు మాత్రమే నెరవేర్చినట్లు తులసిరెడ్డి పేర్కొన్నారు.

వెంకటేశ్వర డిగ్రీ కళాశాలకు అవార్డులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు తేక్వాండో పోటీల్లో మరోసారి సత్తా చాటారు. అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు సాధించి అందరి ప్రశంసలు అందు కుంటున్నారని కళాశాల కరస్పాండెంట్ అరకట వేముల హరి నారాయణ పేర్కొన్నారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ గత డిసెం బరు 28 నుంచి 30వ తేదీల వరకు కర్నాటక రాష్ట్రం బెంగళూరులో ఎల్లంకలో వీఫా తేక్వాండో ఇండియా సంస్థ అంతర్జాతీయ స్థాయి పోటీలు నిర్వహించిందన్నారు. ఇందులో ఇండియా, మలేసియా, ఇజ్రాయిల్, బంగ్లాదేశ్, జపాన్, ఘనా, ఇతోఫియా, యూఎస్ఏ దేశాలకు చెందిన దాదాపు 400 మంది పాల్గొన్నారని తెలిపారు. అందులో ప్రొద్దుటూరు వెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు కోరిగో ఫైట్, పుంసె కటాస్ విభాగాల్లో తలపాడ్డారు. స్థానిక రామేశ్వరానికి చెందిన బెన్వర్ వరప్రసాద్ రెండు విభాగాల్లో బంగారు, సిల్వర్ మెడల్స్ సాధించారు. ఎర్రగుంట్ల మండలం బిస్మిల్లాబాద్‌కు చెందిన రుద్రసేనారెడ్డి, ఎర్రగుంట్లకు చెందిన వికాస్, ప్రొద్దుటూరుకు చెందిన అస్లాం, యగ్నేష్ సిల్వర్ మెడల్స్ సాధించారు. గత డిసెంబరు మొదటి వారంలో బెంగళూరు వేదికగా నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో కూడా ఈ యువకులు బంగారు, సిల్వర్ పతకాలు సాధించారు. ఈ సందర్భంగా విజేతలను ఎన్‌సిసి కో-ఆర్డినేటర్ గౌరీశంకర, వైస్ ప్రిన్సిపల్ వెంకటేశ్వరరెడ్డి, శిక్షకుడు శ్రీనివాసులు, కళాశాల అధ్యాపకులు అభినందించారు.


మెడల్స్‌తో వెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు

ఎర్రగుంట్ల : చిలమకూరు ఉషోదయ పాఠశాల విద్యార్థులు బెంగళూరులో నిర్వహించిన ప్రపంచ స్థాయి తేక్వాండో పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించినట్లు స్కూల్ కరస్పాండెంట్ శివ నారాయణ తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు కావ్య, అభినయ్ స్వర్ణ పతకాలు సాధించారని పేర్కొన్నారు. ఫర్హానా, జయకృష్ణకుమార్, దినేష్‌రెడ్డి, చంద్రశేఖర్, నికాత్ వెండి పతకాలు, వీర శ్రీరితిక, జెస్సికా, రూపశ్రీ కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. ఈ సం దర్భంగా విద్యార్థులకు, వ్యాయామ ఉపాధ్యాయులు సుమన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.


తేక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు

ఎస్‌సి సంక్షేమ సంఘం నూతన కమిటీ నియామకం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఎస్‌సి సంక్షేమ సంఘం నూతన కమిటీ నియామకం రాయలసీమ అధ్యక్షుడు పి.పెద్దరాజు చేపట్టారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఎస్‌సి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సి సంక్షేమ సంఘ రాయ లసీమ కమిటీలు రద్దు అయ్యాయని, నూతన కార్యవర్గంలో తన అధ్యక్షతన రాయలసీమ ప్రధాన కార్యదర్శిగా చింతల రాజేష్, రాయసీమ వర్కింగ్ ప్రెసిడెంట్ కొబ్బరపు సురేష్, కడప జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె.ఎం.విలియం, బిసి సంఘం జిల్లా అధ్యక్షుడిగా బత్తల సుబ్బారాయుడుకు బాధ్యతలు అప్పగించినట్లు ఆయన ప్రకటించారు. ఆ మేరకు ఉత్తర్వులను వారికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలపై దాడులను ఖండించారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఎస్‌సి సంక్షేమ సంఘం సిద్ధాంతాలు నచ్చి తాము సంఘంలో చేరామని, సంఘ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి


ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ్ రామరాజు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

జమ్మలమడుగు నగర పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీలోని గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ విజయ్ రామరాజు ఆదేశించారు. జమ్మలమడుగు అర్బన్ జగనన్న గృహ నిర్మాణాలను శనివారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న కాలనీలో నిర్మిస్తున్న 1794 ఇళ్లను పరిశీలించామన్నారు. అనంతరం నగర పంచాయతీ మిషనర్ వెంకట్రామిరెడ్డిని ఇళ్ల నిర్మాణాల పురోగతిపై అడిగి తెలుసుకున్నారు. జమ్మలమడుగు మున్సిపాలిటీ ఇళ్ల నిర్మాణాల్లో ముందుందని అధికారులను అభినందించారు. మౌలిక వసతులను కూడా త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్, తాగునీరు, రోడ్లు తదితర మౌలిక వసతులు కూడా కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జమ్మలమడుగు ఆర్‌డిఒ శ్రీనివాసులు, కమిషనర్ వెంకటరామిరెడ్డి, తహశీల్దార్ రవీంద్రారెడ్డి, హౌసింగ్ ఎఇ ఓబులేసు, డిఇ బాల మల్లేష్, సచివాలయ ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డును నిర్మించాలని కలెక్టర్‌కు వినతి

జమ్మలమడుగు రూరల్ : స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులోని జడ్‌పి హైస్కూల్‌లో కల్వర్టు రోడ్డు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్ కుమార్ శనివారం ఆర్‌డిఒ కార్యాల యంలో కలెక్టర్ విజయ్ రామరాజుకు వినతి పత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని జడ్‌పి హైస్కూల్లోని విద్యా ర్థులు వచ్చి వెళ్లాలంటే కల్వర్టు సరిగ్గా లేకపోవడంతో రోడ్డు దాటాలంటే ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. స్కూల్‌లో నాడు-నేడు పనులు జరుగుతున్నాయని, వాహనాలు రావాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోం దన్నారు. స్కూల్ యాజమాన్యం ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. కనీసం నాడు-నేడు పని చేస్తున్న కాంట్రాక్టర్ కూడా తాత్కాలిక కల్వర్టు ఏర్పాటు చేయలేదన్నారు. అనంతరం కలెక్టర్ స్పందిస్తూ ఆర్‌డిఒకు సిఫార్స్ చేసి, సమస్యను పరిష్కరించాలని సూచించారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయాన్ని శనివారం కలెక్టర్ విజయ్ రామరాజు ఆకస్మి కంగా తనిఖీ చేశారు. అనంతరం ఆర్‌డిఒతో చర్చించి మండల పరిధిలోని అంబ వరం గ్రామం వద్ద పాలిటెక్నిక్ కళాశాల వెనుక భాగాన ఏర్పాటు చేస్తున్న జగ నన్న కాలనీలను పరిశీలించారు. జగనన్న కాలనీలో కరెంటు, నీటి సమస్య మౌలిక వసతులు కొరత ఉందని ఫిర్యాదు పోవడంతో కలెక్టర్ తని ఖీ చేసి నట్లు ఆర్‌డిఒ కార్యాలయ సిబ్బంది తెలిపారు. కార్య క్రమంలో ఆర్‌డిఒ జి. శ్రీనివాసులు, తహశీల్దార్ రవీంద్రారెడ్డి, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రతి అర్జీని పరిశీలించి సమస్యను పరిష్కరించాలి

చాపాడు : మండల పరిధిలోని లక్ష్మీపేటలో సచివాలయం హెల్త్ క్లినిక్ పశు వైద్యశాలను శనివారం కలెక్టర్ విజయ్ రామరాజు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలిచ్చారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సమస్యను పరిష్కరించాలన్నారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. హెల్త్ క్లినిక్‌లో రికార్డులను పరిశీలించి, ప్రజలకు అందుతున్న వైద్యశాల గురించి ఆరా తీశారు. పశు వైద్యశాలలో అందుబాటులో ఉన్న మందులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ శ్రీనివాసులు, ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, సర్పంచు శ్రీవిద్య, సచివాలయ కన్వీనర్లు చంద్రమోహన్‌రెడ్డి, చంద్ర, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా పనిచేద్దాం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా అందరం పని చేద్దామని పులివెందుల పురపాలక ఇన్‌ఛార్జి, వైస్ చైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వల్లెపు వరప్రసాద్ పేర్కొన్నారు. పురపాలక సభా భవనంలో శనివారం కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం పులివెందుల మున్సిపాలిటీ అభివృద్ధికి ఎన్నో నిధులు కేటాయిస్తూ అందరూ ఆదర్శంగా తీసుకునేలా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. ముఖ్యంగా గత నెల 24,25 తేదీల్లో పులివెందులలో జరిగిన సిఎం పర్యటన విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ పురపాలక తరపున ధన్యవాదాలు తెలిపారు. ఆ సందర్భంగా ముఖ్యమంత్రి కూడా పులివెందులలో జరిగిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారని, చాలా బాగా చేశారని అభినందించారని పేర్కొన్నారు. ప్రతి కౌన్సిలర్ తమ వార్డు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం పులివెందుల మున్సిపాలిటీకి సంబంధించి పలు అభివృద్ధి పనులకు కౌన్సిలింగ్ ఆమోదం తెలిపింది. ముఖ్యంగా పెద్ద రంగాపురానికి చెందిన శానిటరి సెక్రటరీ విధులు సక్రమంగా నిర్వహించడంలేదని, సమావేశాలకు రాలేదని ఇప్పటికే నోటీసులు కూడా పంపామన్నారు. అయినా ఎలాంటి మార్పు రాలేదన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్లు పార్నపల్లి కిషోర్, కొండలరావు, అరకటవేముల సుజాత, శైలజ, పుష్పవతి, ఖాదర్‌బాషా కో-ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, కమిషనర్ వివి నరసింహారెడ్డి, డిఇ గురప్ప, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

పింఛను మంజూరుకు రూ.12 వేలివ్వాలంట

వెల్ఫేర్ అసిస్టెంట్‌పై చర్యలకు బాధితుల డిమాండ్

ప్రజాశక్తి -కొండాపురం

మండలంలోని ఓబన్నపేట గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చే ప్రతి పథకానికి ఒక రేటు నిర్ణయించుకున్నారని గండ్లూరు గ్రామ నివాసి బాల వెంకటగారి రామమునిరెడ్డి తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వెల్ఫేరు అసిస్టెంట్ అశ్విన్ కుమార్‌రెడ్డి తమ తెలివితేటలను ప్రదర్శించి చనిపోయిన వారి పెన్షన్లను కూడా పొంది తమ ఖాతాలో జమ చేసుకుంటున్నారని విమ ర్శించారు. ప్రభుత్వం ఆటో కార్మికులు, రజక, మంగలి, మాదిగ, మగ్గం పని లాంటి కుల వృత్తుల వారికి ఇచ్చే ఆసరా పథకం నుంచి కూడా అందినంత దోచుకుంటున్నారన్నారు. అనర్హులకు కూడా ఆసరా పథకాలను మంజూరు చేసిన సంఘటనలు అనేక ఉన్నాయని పేర్కొన్నారు. రైల్వేలో పెన్షన్ పొందుతున్నవారి కూడా వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయటానికి పెద్ద మొత్తం పుచ్చుకొని పెన్షన్ మంజూరు చేశారని చెప్పారు. రెండేళ్లుగా పెన్షన్ ఇస్తున్నారని, 35 ఎకరాలకు పైన భూమి ఉన్న వారి నుండి కూడా పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసివారికి పెన్షన్ మంజూరు చేశారని తెలిపారు. పెన్షన్ మంజూరు కావాలంటే కనీసం రూ.12 నుంచి 20 వేల వరకు ఇవ్వాలని, లేకపోతే పెన్షన్ మంజూరు చేయనని, నేను జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి బంధువునని, నేను చెప్పినట్లు వినాలని లేనిచో పెన్షన్ రాకుండా చేస్తానని బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలను ఇబ్బంది పెడుతున్నాడని గండ్లూరు గ్రామానికి చెందిన బి.రామమునిరెడ్డిరెడ్డి విలేకరుల ఎదుట వాపోయారు. పారదర్శకంగా ప్రజలకు సేవ చేస్తామని జగన్మోహనరెడ్డి ప్రభుత్వం చెపుతోంటే ఇక్కడ అధికారి మాత్రం డబ్బులు ఇవ్వనిదే ప్రభుత్వ పథకాలు ఇవ్వలేమని నిష్కర్షగా చెబుతున్నాడని ఆదేవన వ్యక్తం చేశారు. ఇవన్నీ మండల స్థాయి అధికారులకు తెలిసినప్పటికీ వారు కూడా పట్టించుకోవడం లేదని, అందులో వారికి కూడా వాటాలు ఉండవచ్చునని ప్రజలు చర్చించుకుంటున్నారని పేర్కొన్నారు. జిల్లా స్థాయి అధికారులు విచారణ చేపట్టి అక్రమాలకు పాల్పడిన అశ్విన్ కుమార్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే సచివాలయం ఎదుట పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.


మాట్లాడుతున్న రామమునిరెడ్డి

విద్యార్థి వ్యతిరేక విధానాలతో భవిష్యత్ ప్రశ్నార్థకం



జెండా ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

విద్యార్థులకు నష్టదాయకమైన నూతన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా పోరాడాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యార్థి వ్యతిరేక విధానాలతో విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకమని ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా నాయకులు గండికోట శివకుమార్ తెలిపారు. ఎస్ఎఫ్ఐ 53వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వద్ద జెండాను ఆయన ఎగురవేశారు. ఈ సందర్భంగా శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గండి సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ మరింత బలపడాలని, ప్రతి విద్యార్థి నోటా ఎస్ఎఫ్ఐ మాట రావాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల కోసం అనేక పోరాటాలతోపాటు విజయాలను సాధించాలన్నారు.

ముద్దనూరు : ఎస్ఎఫ్ఐ 53వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక శ్రీ వివేకవర్ధిని ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో శనివారం జిల్లా కార్యదర్శి వినయ్‌కుమార్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ 1970 డిసెంబర్ 30న అధ్యయనం, పోరాటం, నినాదంతో స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలుగా ఏర్పాటైందన్నారు. అప్పటి నుండి ఇప్పటి వరకు విద్యాపరంగా విద్యార్థుల సమస్యల పరిస్కారం కోసం నిరంతరం పోరాడుతూ అనేక విజయాలు సాధించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న నూతన జాతీయ విద్యా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి నవీన్, పట్టణ నాయకులు మహేష్, సురేష్, అరుణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న క్రిష్ణ, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - మైదుకూరు

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కేర్ క్లబ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రియేటివ్ డ్రాయింగ్ పోటీలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మైదుకూరు నియోజకవర్గ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు కరెడ్ల క్రిష్ణ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు విద్యార్థులపైన ఆధారపడి ఉందన్నారు. పిల్లలందరూ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థి దశనుండి కష్టపడి అనుకున్న గమ్యాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు. కేర్ క్లబ్ ఫౌండేషన్ చైర్మన్ సయ్యద్ యాసిన్ ట్రస్ట్ సభ్యులు విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీయడంలో భాగస్వాములు కావడం పట్ల వారిని అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుభద్రమ్మ మాట్లాడుతూ తమ విద్యార్థులకు కేర్ క్లబ్ ఫౌండేషన్ వారు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఓబులేసు మాట్లాడారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులకు కరెడ్ల క్రిష్ణ మెడల్, ట్రోఫీ, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు నారాయణమ్మ, విద్యార్థులు, ట్రస్టు సభ్యులు శివ, కొండయ్య, సందీప్, వెంకటేష్, గౌస్, బ్రహ్మేంద్ర పాల్గొన్నారు.

వేరుశనగ పంటలో జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

వేరుశనగ పంటలో రైతులు జాగ్రత్తలు పాటించి ఆకుముడత, తెగుళ్ళు, చీడపీడల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని ఎఒ వెంకటకృష్ణారెడ్డి సూచించారు. మండలంలోని చింతకుంట గ్రామంలో రబీలో సాగు చేసిన వేరుశనగ, మినుము పంటలను శనివారం ఎఒ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పంటలను పరిశీలించి రైతులకు తగు సూచనలిచ్చారు. ముఖ్యంగా వేరుశనగ పంట పూత, ఊడ దశలో ఉందన్నారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ లక్ష్యంతో ముందుకు సాగాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ప్రతి విద్యార్థి ఓ లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు వెళ్లాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ లింగాల ఉషారాణి, వైసిపి పురపాలక ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, పురపాలక చైర్మన్ వల్లపు వరప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ గోటూరు చిన్నప్ప పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మహిళా రక్షణ కోసం దిశ యాప్‌ను తీసు కొచ్చారన్నారు. ఈ యాప్ ద్వారా మహిళలు ఏదైనా ప్రమాదంలో ఉంటే వెంటనే మెసేజ్ పెడితే పోలీసులు తక్షణమే స్పందిస్తారని తెలిపారు. దేశంలోనే ఎక్కడలేని విధంగా విద్యకు పెద్ద పెద్దపీట వేసిన వ్యక్తి జగనన్న అని పేర్కొన్నారు. ముందుగా వైఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పురపాలక వైస్ చైర్మన్ హఫీజ్, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గ్రంథాలయ చైర్మన్ ఉషారాణి

సాంకేతికతతోనే అధిక దిగుబడులు

ప్రజాశక్తి - ఖాజీపేట

వ్యవసాయ సాగులో రైతులు సాంకేతికతను ఉపయోగించి అధిక దిగుబడులు సాధించవచ్చని ఎఒ నాగార్జున, ఏరువాక కేంద్రం సమన్వయకర్త మురళీకృష్ణ, కెవికె శాస్త్రవేత్త శిల్పకళ పేర్కొన్నారు. మండల పరిధిలోని తిప్పాయపల్లె గ్రామంలో డ్రోన్ పరికరం ద్వారా రసాయనిక పురుగు మందుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. రిలయన్స్ ఫౌండేషన్ సౌజన్యంతో ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డ్రోన్ పరి కరంపై డెమో నిర్వహించారు. వ్యవసాయ శాఖ 40 నుంచి శాతం రాయితీతో డ్రోన్ పరికరాలను అందించనున్నట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డ్రోన్ పరికరం ద్వారా మందులు పిచికారి చేయడం వల్ల సమయం ఆదాతోపాటు మంచి దిగుబడులు సాధించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. రైతు తవ్వా ఈశ్వర్‌రెడ్డి పొలంలో డ్రోన్ పరికరం వినియోగంపై కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


డ్రోన్ పరికరంతో అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

లింగనిర్ధారణ చట్ట రీత్యా నేరం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని డిప్యూటీ డెమో రమణమ్మ తెలిపారు. పట్టణ పరిధిలోని రంగాపురం సచివాలయం, అంగన్‌వాడీ సెంటర్‌లో శనివారం మాతృ, శిశు మరణాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాతృ మరణాలను అరికట్టాలంటే ఆడపిల్లలు యుక్త వయసు నుంచే రక్తహీనత రాకుండా కాపాడుకోవాలన్నారు. ఐరన్ మాత్రలు వేసుకుంటూ.. కూరలు, పండ్లు ప్రతిరోజు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం శైలజ, అంగన్వాడీ టీచర్ హిమబిందు, వాలంటీర్ సుహాసిని పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిప్యూటీ డెమో రమణమ్మ

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి - ముద్దనూరు

వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రాబివృద్ధి శూన్యమని టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కమ్మ వారిపల్లెలో శనివార ఆయన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ అస్తవ్యస్థ పరిపాలనతో ముఖ్యమంత్రి జగన్ వైఫల్యం చెందారని విమర్శించారు. భూపేష్‌రెడ్డి ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపికి ఓట్లు వేసి, వేయించి తనను ఎమ్మెల్యేగా, చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, నాయకులు శివరామిరెడ్డి, అశోక్‌రెడ్డి, రంగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఖాదర్‌ఖాన్, శేఖర్, నాగేశ్వరరావు, పెద్ద ఆంజనేయులు, రవికుమార్, బాలముని పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న భూపేష్‌రెడ్డి

బుడ్డా వెంగల్‌రెడ్డి ఆదర్శనీయుడు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఆదర్శవంతమైన గుణగణాలు కలిగిన బుడ్డా వెంగల్‌రెడ్డిని నేటి తరానికి పరిచయం చేయాలని రేనాటి సూర్యచంద్రుల సేవా సంఘం అధ్యక్షులు డాక్టర్ స్వరూప్ కుమార్‌రెడ్డి, టిటిడి పాలక మండలి సభ్యులు సంఘం ఉపాధ్యక్షులు టంగుటూరి మారుతీ ప్రసాద్ పేర్కొన్నారు. వెంగల్‌రెడ్డి 122వ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక వెంగల్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుడ్డా వెంగల్‌రెడ్డి బాల్యం నుండే సేవాగుణం అలవరచుకున్న ఉత్తమ వ్యక్తి అన్నారు. ఆనాటి డొక్కల కరువు సమయంలో వేలాది మందికి ఆకలితీర్చిన అన్నదాతగా కీర్తి గడించారన్నారు. తనకున్న యావదాస్తిని దానధర్మాలకే వినియోగించి, అప్పటి బ్రిటీష్ రాణిచే బంగారు పతకాన్ని అందుకున్న గొప్పదాత అన్నారు. ఇలాంటి మహానుభావుల జీవిత చరిత్రలను స్ఫూర్తిదాయనమైన జీవవ విధానాన్ని భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు వెంగల్‌రెడ్డి అభిమానులు పాల్గొన్నారు.


బుడ్డా వెంగల్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తునన అభిమానులు

బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - వేంపల్లె

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధిత కుటుంబానికి మానవతా సేవా సంస్థ సహకారంతో దాతలు ఆర్థికంగా ఆదుకోవడం హర్షణీయమని సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ షబ్బీర్ వలి తెలిపారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన శివప్రసాద్ ఇంటి వద్దకు మానవతా సేవా సంస్థ సభ్యులు వెళ్లి బాధితులకు దాతలు ఇచ్చిన రూ.52 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివప్రసాద్ కుటుంబాన్ని ఆదుకునేందుకు దాతలు ముందుకు రావడం గొప్ప విషయమన్నారు. మానవతా సేవా సంస్థ అధ్యక్షుడు కృష్ణతేజా మాట్లాడుతూ బాధిత కుటుంబానికి గతంలో సంస్థ తరపున ఆర్థికంగా ఆదుకుంటామని హామీ ఇచ్చామన్నారు. ఆ మేరకు మానవతా సంస్థ తరుపున రూ.5 వేలు, కాణిపాకం దేవస్థానం డైరెక్టర్ గోగుల కొండయ్య రూ.5వేలు, తిరుమలరెడ్డి రూ.10 వేలు, మానవత సభ్యులు రూ.12,500 ఇచ్చినట్లు తెలిపారు. పాములూరుకు చెందిన మానవతా డైరెక్టర్ మస్తాన్ రెడ్డి చిన్ననాటి మిత్ర బృందం రూ.25 వేలు, షబ్బీర్ వలి 5 బస్తాల బియ్యాన్ని అందజేసినట్లు వివరించారు. మెరుగైన చికిత్స కోసం రవాణాకు అవసరమైన అంబులెన్స్‌ను డాక్టర్ ఎస్ఎఫ్ బాషా కల్పించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో మానవతా సేవా సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి, సంస్థ ఉపాధ్యక్షులు ఓబుల్‌రెడ్డి, ప్రతినిధులు చల్లా బాలాజీ, శ్రీకళ, శ్రావణ్‌కుమార్, గోవర్ధన్, నాయబ్, రంజిత్, చలపతి, రెడ్డి సంఘం మీడియా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.